క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలోని సచివాలయం 2,3 పరిధిలో సోమవారం 4 గంటలకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక మాయాబజార్ సెంటర్ వద్ద నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి(శివకోటి) కోరారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన దంపతులు మంచాల రాజేష్, జ్యోతి ఘర్షణ పడ్డారు. వీరితో మాట్లాడేందుకు ఇరువైపులా బంధువులు వీరి ఇంటికి వచ్చారు. మాటలు ఘర్షణకు దారి తీయడంతో పరస్పర దాడికి దిగారు. రెండు వర్గాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్నా సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు రైతు, సుమారు 40 సంవత్సరాలు ఉంటుంది. గచ్చాకాయ రంగు ఫ్యాంట్, లేత నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో కొండ చిలువ



మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఆవరణలో ఆదివారం ఓ కొండ చిలువ కలకలం రేపింది. భారీ వర్షాలకు కొండపై నుంచి కొండ చిలువ బెటాలియన్ ఆవరణలోని ఏటీఎం వెనుక భాగంలో కనిపించింది. స్థానికులు కొండ చిలువను గమనించి పట్టుకుని హాని కలుగకుండా విద్యుత్ స్తంభానికి కట్టివేశారు. సుమారు 14 అడుగుల పొడవు ఉన్న కొండ చిలువను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తామని బెటాలియన్ సిబ్బంది తెలిపారు.

మెడికో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు జంగాల సాంబశివరావు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో ఎంతోమందికి వైద్య సేవలను అందించిన డాక్టర్ డి.ఎస్.ఎన్. శర్మ తృతీయ వర్ధంతి సందర్భంగా ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి పాఠ్యపుస్తకాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, డాక్టర్ మోహన్, డాక్టర్ పలగాని శ్రీనివాసరావు, మారుతి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఓటరు సర్వే

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో ఓటర్ల సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పద్మనాభుడు ఆదివారం తెలిపారు. ఒకే ఇంటి నంబర్‌పై ఉన్న ఓటర్ కార్డులు వివరాలు, వయస్సు పైబడిన వారి ఓట్లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 113 తాళ్లూరులో పంచాయతీ కార్యదర్శి సత్యానంద్, బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు నమోదు చేస్తున్నారు. గ్రామంలో మొత్తం నాలుగు బూత్‌లు ఉండగా వాటిలో 1500 వరకు కుటుంబాలు ఉన్నాయని సుమారు 3వేల 500వరకు ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటివరకు 500 మంది ఓటర్ల వివరాలు పరిశీలించినట్లు వివరించారు.

పీర్ల చావిడి స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాడికొండ: తాడికొండ ప్రధాన రహదారిపై 80 గజాల పీర్ల చావిడి స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ గని కోరారు. తాడికొండ ప్రధాన రహదారిలో ఉన్న ఈ విలువైన భూమిని ఆక్రమించి మంగళగిరికి చెందిన వ్యక్తి షాపింగ్ కాంప్లెక్ నిర్మాణం చేశాడని ఆరోపించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది మహేశ్వరరావు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్, మహేశ్వరరావు

తెనాలిరూరల్: చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని తెనాలి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది ఎస్వీ మహేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి ఆదేశాల మేరకు ఆదివారం తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా అనేది బలవంతం, బెదిరింపు మార్గాలను ఉపయోగించి వ్యక్తులను రవాణా చేయడమని చెప్పారు. ఈ చర్యల యొక్క అంతిమ ప్రయోజనం వ్యక్తుల యొక్క శ్రమను దోపిడి చేయడం, లైంగిక దోపిడి, బలవంతపు శ్రమ, బానిసత్వం వంటి వివిధ అత్యంత అవమానకరమైన రూపాల్లో సాగుతుందన్నారు. భారతీయ శిక్షాస్మృతిలోని 370 సెక్షన్ ప్రకారం మానవ అక్రమ రవాణా నేరమని అందులకు ఏడేళ్ల కన్నా తక్కువ కాకుండా పదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించబడుతుందని చెప్పారు. పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ, చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్య వంతులను చేయడమే న్యాయ విజ్ఞాన సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థలో ఎస్సీ, ఎస్టీ స్త్రీలకు, మానసిక వికలాంగులకు, యాచకులకు, చిన్న పిల్లలకు, ప్రకతి వైపరీత్యాల బారిన పడిన వారికి, మానవ అక్రమ రవాణాకు గురైన వారికి సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం మించనటు వంటి వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని చెప్పారు. ఉచిత న్యాయ సహాయానికి అర్హత కలిగిన వార్తు వారి సమస్యను అర్జీ రూపంలో అందించినట్లయితే త్వరితగతిన న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అంగలకుదురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధుల్లో దంతసమస్యలకు ఆస్కారం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జులై నెల సమావేశం ఏర్పాటు చేశారు. వయోవృద్ధుల్లో ఎక్కువ మంది దంత సమస్యలతో బాధపడుతున్నారనే భావనతో ఇదే వేదికపై దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దంతవైద్యులు డాక్టర్ డి.రవీంద్రనాథ్, డాక్టర్ జె.స్వప్న, డాక్టర్ చందు శివ పరీక్షలు చేశారు. పళ్లు సరిగా లేనివారు ఆహారం సక్రమంగా నమిలేందుకు వీలుపడదని, దీనివల్ల జీర్ణాశయానికి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్పారు. 65–75 ఏళ్ల వయస్కుల్లో గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు, షుగర్ వ్యాధి ఉన్నవారికి దంత సమస్యలు వస్తాయన్నారు. ప్రతి ఆర్నెల్లకు ఓసారి డాక్టరును సంప్రదించి దంత సమస్యలు నిరోధించుకోవాలని సూచించారు. అనంతరం ముగ్గురు వైద్యులను సత్కరించారు. సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఇటీవల మృతిచెందిన ప్రొఫెసర్ పిరాట్ల నారాయణమూర్తికి శ్రద్ధాంజలి ఘటించారు.

వాగు పూడిక తీసి, నీటిని విడుదల చేయాలి

ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు



ఊదర వాగును పరిశీలిస్తున్న ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, రైతులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఊదర వాగు పూడిక తీసి, వరి సాగు చేస్తున్న రైతులకు సాగునీటిని అందించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. గ్రామంలోని ఊదర వాగును స్థానిక రైతులతో కలసి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాగులో పూడిక, చెట్లను తొలగించాలని, అలా తొలగించకపోతే ఇప్పటికే వరి పొలాల్లో వారం రోజుల నుంచి నిల్వ ఉన్న నీరు మరో 15 రోజుల వరకు బయటకు వెళ్లే మార్గం లేదని పేర్కొన్నారు. దీని వల్ల ఈ సంవత్సరం ఖరీఫ్‌ను రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన వెద పద్ధతిలో సాగు చేసిన వరిపొలాలు దెబ్బతిన్నాయని, రైతులు తిరిగి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం వచ్చిందని అన్నారు. వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలు మరలా సాగు చేసుకోవడానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై తక్కువ కాలవ్యవధిలో పంట వచ్చే విత్తనాలు ఇవ్వాలని విన్నవించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఊదర వాగు నీటిని తరలించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కర్రే దావీదు, బండ్లమూడి కనకాంబరం, జి.బాలచంద్రుడు, భీమవరపు అమ్మిరెడ్డి, ఎం.కోటేశ్వరరావు, కె.బాబూరావు, జి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, టి.రామారావు, బుల్లబ్బాయి, కృష్ణారెడ్డి, ఎన్.శేషుకుమార్, చిన్నబ్బాయి పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి !



మాట్లాడుతున్న సీఆర్‌ఏఎఫ్ సమన్వయకర్త సమీర్‌కుమార్. వేదికపై ఏఎస్ఐ లక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అపరిచిత వ్యక్తులతో పరిచయాలకు దూరంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగ ఏఎస్ఐ లక్ష్మి సూచించారు. రాజాగారితోటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సీఆర్‌ఏఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో మాట్లాడటం, స్మార్ట్‌ఫోన్ల ద్వారా సోషల్ మీడియాలో ఫోటోలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల ప్రమాదాల్ని కొనితెచ్చుకోవడమే అవుతుందని తెలిపారు. పలు సందర్భాల్లో అక్రమ రవాణాకు గురయ్యే అవకాశాలున్నాయని హెచ్చరించారు. సీఆర్‌ఏఎఫ్ సమన్వయకర్త కోలా సమీర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీఆర్‌బీ–2021 గణాంకాల ప్రకారం దేశంలో ప్రతి గంటకు తొమ్మిది మంది పిల్లలు అదృశ్యమవుతున్నారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ప్యానెల్ న్యాయవాది కట్టా కాళిదాస్ మాట్లాడుతూ పిల్లలకు ప్రాథమిక హక్కులు ఉన్నాయని, వాటితో పాటు విధుల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయినా, తప్పిపోయినా 24 గంటల్లోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లా బాలల రక్షణ విభాగాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ బాలబాలికలు తమకు ఆపద ఎదురైన సమయంలో ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112, 181కు ఫోన్ చేయాలని సూచించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌ఏఎఫ్ సంస్థ న్యాయవాది నాగలక్ష్మి, సిబ్బంది, వార్డెన్లు పాల్గొన్నారు.


బండి సాహితీరెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా

గుంటూరు రూరల్: సాహితీరెడ్డి ట్రస్టు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతుల సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా పేర్కొన్నారు. జొన్నలగడ్డ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాహితీ రెడ్డి 34వ జయంతి సందర్భంగా 100 మంది పేద విద్యార్థినులకు రూ.5000 చొప్పున రూ.5లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని, మాట్లాడారు. లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని తెలిపారు. ఉపాధ్యాయ శాసన మండలి సభ్యురాలు టి.కల్పలతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వ్యాపారవేత్త బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, రెడ్డి బాలుర వసతిగృహం అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, జొన్నలగడ్డ సర్పంచ్ ఎం. శిరీష, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆవు

చికిత్స పొందుతూ యువకుడు మృతి



సంగణం దుర్గా ప్రసాద్ (ఫైల్)

మంగళగిరి: రోడ్డు పక్కనే వెళ్తున్న ఆవు ఆకస్మాత్తుగా రోడ్డు మధ్యలోకి దూసుకువచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో యువకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఎంటీఎంసీ పరిధిలోని చినకాకానికి చెందిన నంగణం సుబ్బారావు ద్వితీయ కుమారుడు నంగణం దుర్గాప్రసాద్(17) ఈనెల 14వ తేదీన ద్విచక్ర వాహనంపై చినకాకానిలోని తన నివాసం వద్ద నుంచి పనిమీద మంగళగిరికి బయలుదేరాడు. మార్గమధ్యలోని ఆర్టీసీ డిపో రోడ్డు సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే వెళుతున్న ఆవు ఆకస్మాత్తుగా దూసుకువచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి దుర్గా ప్రసాద్ రోడ్డుపై పడిపోగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎన్నారై వైద్యశాలకు తరలించారు. 17 రోజులుగా చికిత్స పొందుతున్న దుర్గా ప్రసాద్ శనివారం రాత్రి మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు



మంగళగిరి: యువకునికి ప్రమాదవశాత్తూ విద్యుత్ హైటెన్షన్ వైరు తగలడంతో గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటకకు చెందిన ఆనంద్ గౌతమ బుద్ధా రోడ్డు పక్కనే ఉన్న ఓ బిల్డింగ్‌లో నివసిస్తూ టీ దుకాణాన్ని నడుపుతున్నాడు. ఇంటి ఎదుట ఉన్న ఫ్లెక్సీని సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తూ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై ఫ్లెక్సీ ఐరన్ ఫ్రేమ్ పడటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకోగా వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు.

ఆవుల యజమానులపై క్రిమినల్ కేసులు

మంగళగిరి: నగరంలో ఆవులను రోడ్లపైకి వదులుతున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. శనివారం రాత్రి నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డుపై రెండు ఆంబోతులు పొడుకుని బీభత్సం సృష్టించిన ఘటనలో ఓ వృద్ధురాలు గాయపడగా ఆటో ధ్వంసమైన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే వెంటనే నగరపాలక సంస్థ అధికారులకు ఆవులు, కుక్కలు, పందులు పెంచుకుంటూ రోడ్లపైకి వదులుతున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో అనేకమార్లు అయా యజమానులతో సమావేశాలు నిర్వహించి హెచ్చరించడం జరిగిందని, అయినా యజమానులు నిర్లక్ష్యంతో రోడ్లపైకి వదలడంపై ఎమ్మెల్యే ఆర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు యజమానులను సమావేశ పరిచి వారు పెంచుకుంటున్న ఆవులు, పందులు, కుక్కలు రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని గుంటూరు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఏఎస్పీ కె. సుప్రజ చెప్పారు. ప్రవణ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం పాత గుంటూరులో గుడిబడి కార్యక్రమం నిర్వహించారు. దానిలో భాగంగా ప్రవణ పీఠం సభ్యులు ఆలయాన్ని శుభ్రం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ సుప్రజ ఆలయాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో పాలు పంచుకున్నారు.

అంజుమన్ ట్రస్టుబోర్డు ప్రమాణ స్వీకారం



మంగళగిరి: అంజుమన్ ట్రస్టుబోర్డు ఎన్నికల్లో విజయం సాధించిన ఇస్లామిక్ ఫ్రంట్ అభ్యర్థులు నగరంలోని టిప్పర్ల బజారు షాదీఖానా ఆవరణలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల నిర్వహించిన అంజుమన్ ట్రస్టుబోర్డు ఎన్నికల్లో గెలుపొందిన ఇస్లామిక్ ఫ్రంట్ అభ్యర్థులు షేక్ అక్బర్ బాషా, షేక్ అబ్దుల్ సలీమ్, షేక్ యాసిన్, షేక్ అలీ, షేక్ అబ్దుల్ సలీమ్, షేక్ హనీఫ్ షా ఖాదరీ, షేక్ హఫీజ్ (బద్రి) ప్రమాణ స్వీకారం చేశారు. ఇస్లామిక్ ఫ్రంట్ నూతన అధ్యక్షుడిగా రియాజ్‌ను ఎన్నుకున్నారు. తొలుత నగరంలో ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో ఆదివారం బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 382 మందికి పరీక్షలు నిర్వహించగా 209 మందిని శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి నేటి నుంచి ఆగస్టు 04వ తేదీ వరకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి తీసుకెళ్ళి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బండ్ల కోటేశ్వరరావు, ధూళిపాళ్ల ఏసుబాబు, ధూళిపాళ్ల ఏసుబాబు, కాశింశెట్టి పున్నారావు, సీరుకొండ పెద్దబ్బాయి వైద్యులు జమ్ముల సాయి మౌనిక, షాజీ మారిన్, సిబ్బంది రత్నేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిరూరల్: వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దుగ్గిరాల ప్రభుత్వ వైద్యులు అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఆదివారం దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు.

వైద్యవిద్యార్థులకు 'మానవత' ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ రామ్‌చంద్, డాక్టర్ శారద

తెనాలి: ఉక్రెయిన్‌లో వైద్యవిద్య అభ్యసిస్తున్న తెనాలికి చెందిన అన్నాచెల్లెళ్లు నిడుముక్కల మహేష్, మౌనికకు మానవత స్వచ్ఛంద సంస్థ రూ.30 వేల ఆర్థికసాయం చేసింది. ఉక్రెయిన్‌లో యుద్ధం నేపథ్యంలో వీరి చదువును ఉజ్బెకిస్తాన్‌కు మార్చుకున్నారు. డాక్టర్ శారద హాస్పటల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన మానవత తొలి సర్వసభ్య సమావేశంలో చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, కో–చైర్మన్ డాక్టర్ డి.శారద ఈ మొత్తాన్ని ఆ విద్యార్థులకు అందజేశారు. ఇద్దరూ చెరొక రూ.10 వేలు, సంస్థ సెంట్రల్ కమిటీ మరో రూ.10 వేలను సమకూర్చినట్టు తెలిపారు. 'మానవత' ఆధ్వర్యంలో యువతీ యువకులు ఉద్యోగవకాశాలకు కావాల్సిన నైపుణ్య శిక్షణను కల్పిస్తామని డాక్టర్ రామ్‌చంద్ చెప్పారు. ఆపత్కాలంలో రక్త కొరతను నివారణకు రక్తదాతల డేటాబేస్‌ను నిర్వహిస్తామని చెప్పారు. డాక్టర్ శారద మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ని ఆటుపోట్లు వచ్చినా విజేతలుగా నిలవాలని కోరారు. సమాజం నుంచి తీసుకున్న మొత్తానికి పదింతలు తిరిగి ఇవ్వడం నేర్చుకోవాలని సూచించారు. ఏఎస్ఎన్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహితం, పర్యావరణ హితమైన కార్యక్రమాలను మానవత చేపట్టాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపల్ డీవీ సోమయ్యశాస్త్రి మానవత కార్యక్రమాలను ప్రశంసించారు. శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి తన ప్రసంగంలో డాక్టర్ శారదను మూర్తీభవించిన సేవగా కొనియాడారు. వెంపటి సత్యనారాయణ, విశ్రాంత ప్రిన్సిపల్స్ పరుచూరి రాఘవేంద్రరావు, ఎ.రాజేశ్వరి, మానవత సభ్యులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమం ప్రారంభం



ప్రారంభిస్తున్న అక్కిదాసు కిరణ్‌కుమార్

తెనాలి: ఎల్‌సీ సింహం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూరల్ మండలం పెదరావూరు శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన అనాథ వృద్ధాశ్రమం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిరాశ్రయులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన ఆశ్రమానికి వైద్యపరంగా అండగా ఉంటామని ముఖ్యఅతిథి డాక్టర్ ఆలపాటి కృష్ణసందీప్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, నిరుపేదలకు ఉచితంగా నివాసం, వైద్యం, భోజనం, పరమపదించాక అంత్యక్రియలు చేస్తామని చెప్పిన నిర్వాహకులకు దైవ సహాయం ఉంటుందన్నారు. ప్రముఖ న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ట్రస్ట్ చైర్మన్ ఏడుంబాక వెంకటస్వామి యాదవ్, ట్రస్ట్ సభ్యులు వేల్పూరి వివేకానంద్, వ్యాసం శ్రీనివాసరావు, జగన్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఖలేదా నసీమ్, క్లబ్ బాధ్యులు

తెనాలి: సమాజంలో అవసరాలను గుర్తించి చేయదగిన సాయం చేస్తున్న రోటరీ క్లబ్ సామాజికసేవ నిరుపమానమని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని లక్ష్మీప్రియ జ్యూయలర్స్ వద్ద గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖలేదా నసీమ్ మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ కార్యక్రమం చేపట్టిన క్లబ్ బాధ్యులను అభినందించారు. మొత్తం 100 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వార్డు కౌన్సిలరు సాయిహరేరామ్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ ఎస్‌కే బీబీజాన్, లక్ష్మీప్రియ జ్యూయలర్స్ అధినేత టి.భాస్కరరావు, జీవీ నారాయణ, జగదీశ్వరాంబ, ఊదర వెంకట పూర్ణచంద్, డాక్టర్ రవీంద్రనాథ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగర పరిధిలోని కాజలో ఆదివారం మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో 1600 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందని సంస్థ ఫౌండర్ వంగర సురేష్‌కుమార్ తెలిపారు. డాక్టర్లు వేణుగోపాల్ రెడ్డి, ప్రసాద్, వంశీ, చక్రవర్తి, శ్రీలేఖ, రమ్య, రాకేష్, అమరనాథ్, బాషా రోగులకు సేవలందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, స్థానిక పెద్దలు ఆర్ల బ్రహ్మయ్య, సంస్థ సభ్యులు రమేష్, రవి, శ్రీనివాస్, హనుమ, పూర్ణయ్య, మల్లికార్జునరావు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కదిలే రైలు నుంచి దిగుతూ..

రేపల్లె: కదిలే రైలు నుంచి దిగుతున్న క్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం రేపల్లెలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణు వివరాల మేరకు.. మండలంలోని మోర్లావారిపాలేనికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి జముడుగాని నాగరాజు.. తెనాలి నుంచి రేపల్లెకు రైలులో వస్తున్నాడు. మోర్లవారిపాలెం గేటు వద్ద రైలు నెమ్మదించి ఆయన దిగే క్రమంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో నాగరాజు కాలు పూర్తిగా తెగిపోయింది. తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు, కుటుంబ సభ్యులు అంబులెన్స్ సాయంతో గుంటూరుకు తరలించారు.